# ఆవేశం

శ్రీ దశిక రామారావు

అమ్మాయీ! ఇటురా!

ఏం! నాన్నగారూ!

ఏం! చేస్తున్నావ్

ఆడుకుంటున్నాను నాన్నగారూ!

ఏమి ఆడుకోవడమే, ప్రపంచకం దగ్ధమైపోతుంటే నీబోటి యువతులంతా దేశపరిస్థితులు ఓ కంటితో చూడకపోతే భారతమాత కడుపున చెడపుట్టినవారౌతారు

'అదేమిటి నాన్నగారు ఆధోరణి .

'ధోరణా! ఆ పేపరు యిల్లా తీసుకురా!

ఇదిగో! చూశావా ఎంతపెద్ద అక్షరాలతో వేశారో పాకిస్తానట! ఏదీ మీ అమ్మను కేకేయి

'అమ్మా'

ఓ! అమ్మా ఇటురావే! నాన్నగారు కేకేస్తున్నారు!

'ఎందుకే!' ఏమండీ! ఏమిటా అర్జంటు

ఏమిలేదు! ఒక్కనిముషం నీ అంట్లు తోమడాలు, నీయిల్లు అలకడాలు, ఈ ముగ్గులెట్టడాలు, కట్టిపారెయ్యి ఏమని అడుగుతావేం ఇంకా ఏముంది అంతా మునిగిపోయింది దేశంఅంతా కల్లోలమై అగ్నిపరీక్షలో ఉంది దేశం ఖండ ఖండాలుగా చీలి ముక్కలై ఎందుకూ పనికరాని 'స్థాన్'లక్రింద తయారై, నిష్కళంక భారతావనిని ఏకఛత్రాధిపత్యముకొరకు ఉవ్విళ్లూరే మన భారతదేశాన్ని, చీల్చి, చెండాడి, స్వయంకృతాపరాధినిగాచేయ సమకట్టిన, కుత్సిత పరప్రభుత్వ సమాలోచన వలలోపడి దేశమాత తహతహలాడిపోతోంది అబ్బ! ఏం చెప్పను ఈ పేజీ చూడు! ఘోరం! ద్రోహం! సంస్థానప్రజలు ఏకైక భారతావనిలోని పుత్రులు కానేకారా! సంస్థానాలకు సర్వస్వతంత్రమా! కాదు! ఈ ఆస్థానాల పరిస్థితి ఎంతవరకు వచ్చినది? స్వతంత్ర ఆస్థానముల క్రింద ప్రకటించి, తమ ఇష్టమొచ్చిన రాజరికంతో చెయ్యి చెయ్యికలిపి ప్రజలను పీల్చి పిప్పిచేయ చూసే, యీ ఆస్థానలకు సర్వస్వతంత్రమట కట్టగుడ్డకి, తిన తిండికి కరువొచ్చిన మనబోటిఅభాగ్యులు ఈ పరిపాలనలో లక్షలు, కొల్లన్నారు అబ్బ! తలచుకొంటే గుండె బ్రద్దలైపోతుంది స్వతంత్ర భావాలు స్వరాజ్యకాంక్ష, సక్రమ పరిపాలన అరికట్టి, బానిసకూడు పెట్టి వట్టి గొర్రెల మందలుగా తయారుచేసి, తన వాంఛలకు, తన గౌరవమర్యాదలకి ఉపయోగించే ఒక పనిముట్టువులా ఈసంస్థాన ప్రజలని తయారుజేసారు సర్వస్వతంత్రమట ఆస్థానములకు

పూర్వపు రోజులు వెళ్ళిపోయాయి నవ్యభావాలతో, నవనీత మనస్సులతో, సర్వస్వతంత్ర కాంక్షలతో, దేశాభ్యుదయ ఆవేశాలతో, ఇది ఉడుకురక్తము, ఇది చల్లారిన రక్తము అనే మీమాంస లేకుండా, కత్తినిదూసే నవయుగం ప్రారంభమైంది

ఈ నవ్యయుగంలో, ఈ చారిత్రాత్మక ఘట్టంలో, ఆస్థానాల ప్రజలు దేశంకోసం, తమహక్కుల కోసం, తమతోడి ప్రజాభ్యుదయాలకోసం, తమ భావి భాగ్యోదయంకోసం ఈరక్తాన్ని ధారపోసి ఈ సర్వస్వతంత్ర ఆస్థానాలకు వ్యతిరిక్తంగా నిలచి, తమ భావి సర్వస్వతంత్ర భారతావనిలో కలసి భారతమూర్తిసేవ చేయక తప్పదు

"నాన్నగారూ! లేవండి! మనదేశం మన జన్మహక్కు మనం అఖిలభారతదేశంలో కలసిపోదాం పదండి